క్లుప్తంగా

విధుల్లో చేరిన జెడ్పీ సీఈఓ


బాధ్యతలు స్వీకరిస్తున్న నాగలక్ష్మి

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వాణాధికారిగా బి.నాగలక్ష్మి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న ఆమె ఇటీవల పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ నూతన సీఈఓగా బదిలీ అయ్యారు. ఆమెను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్, జిల్లా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం నాగలక్ష్మి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కమిషనర్‌కు సన్మానం

పాల్వంచ: నూతనంగా పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.సుజాతను శుక్రవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతోజు బ్రహ్మారావు, సెక్రటరీ ఎండీ.షాబుద్దీన్‌ఖాన్, బొర్రా జయమ్మ, శ్రీపాద సత్యనారాయణ, డీవీ.రత్నం, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో విద్యనభ్యసించాలి

ఇల్లెందు: కృషి, పట్టుదలతో విద్యార్థులు విద్యనభ్యసించాలని డీఐఈఓ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు విలియం ప్రసాద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టేకులపల్లి: ఈనెల 8న జిల్లా కేంద్రంలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ విద్యా, వైజ్ఞానిక జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్ ఉపాధ్యాయులు, విద్యాభిమానులను కోరారు. ఈ మేరకు శుక్రవారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మహాసభకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర కార్యదర్శి రాజు డీసీఎంఎస్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. తారాబాయి, రాజు, హము, సైదులు నాగేశ్వరరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న దేవీప్రసన్న

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలను సమానంగా అందిస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అన్నారు. ప్రభుత్వ ఏడాది ప్రజాపాలన విజయోత్సవాలను మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజిని, దివ్య, జ్యోతి, సరిత, బర్ల నాగమణి, సున్నం లక్ష్మి, బడుగు కృష్ణవేణి, పద్మశ్రీ, పార్వతి, రేణుక, సౌజన్య, స్వరూప, ప్రియాంక, వెంకటమ్మ, శ్రీలక్ష్మి, సావిత్రి, సుగుణ, హైమావతి, కొల్లు పద్మ, పుష్పలత, లలిత, సంధ్య పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు మాజిద్ రబ్బానీ, షేక్ ఆలం, ముహమ్మద్ షమీం, హఫీజుద్దీన్, మసీదు అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచి అంబేడ్కర్


కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


పాల్వంచ: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య భావాలను బౌద్ధ తాత్విక దృక్పథంతో మేళవించారని పేర్కొన్నారు. అన్నివర్గాల వారికి సమన్యాయం చేసే విధంగా నేటి దేశానికి దిక్సూచిగా మారాడని, ఆయన ఆశయాలు, ఆలోచనలు, సేవలను కొనియాడారు. భారతదేశంలో వచ్చిన రాజకీయ పరిణామాలన్నింటిపై అంబేడ్కర్ బలమైన ముద్ర ఉందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


సింగరేణి(కొత్తగూడెం): పూలమాల వేస్తున్న సింగరేణి అధికారులు


కొత్తగూడెంఅర్బన్: బీఎస్పీ ఆధ్వర్యంలో..


బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


జూలూరుపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఇల్లెందు: మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో..


టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో..

డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ వివేక్

జూలూరుపాడు: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అన్నారుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జూలూరుపాడు తహసీల్దార్ కె.స్వాతిబిందు గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో అన్నారుపాడు గ్రామంలో 49 డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించగా, 32 ఇళ్లను ఎస్టీ లబ్ధిదారులు కేటాయించారు. 17 ఇళ్లు మిగిలి ఉన్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు 17 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి గ్రామసభలో తీర్మానం చేసినట్లు చెప్పారు. త్వరలో ఇళ్ల అప్పగించడం జరుగుతుందన్నారు. గిర్దావర్ ఎం.తిరుపతిరావు, ప్రత్యేక అధికారి ఎం.రామకృష్ణ, సెక్రటరీ బి.రమణి పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీ కాలనీ గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ వివేక్ గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో గతంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మొత్తం 61 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఇల్లు లేని, గతంలో ప్రభుత్వ పథకాలను వినియోగించుకోని రేషన్‌కార్డు ఉన్న 20 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

నేడు ఆటోల బంద్‌ను విజయవంతం చేయండి

ఇల్లెందు: మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సుల వలన నష్టపోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఇఫ్టూ అనుబంధ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి కోరారు. శుక్రవారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఎంతోమంది ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, కుటుంబాలకు పూటగడటం కష్టంగా మారిందన్నారు. తక్షణమే మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధనుంజయ్, సాధిక్, రెహమాన్, నవీన్, చిన్న, సీతారాములు, అశోక్, కిన్నెర రమేష్, బావ్‌సింగ్, వెంకటేశ్వర్లు, కృష్ణ, నర్సింహా, వీరన్న, ప్రభాకర్, కోటేశ్వరరావు, అనిల్, సురేష్, చందర్, కమల్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

కళాజాతా

టేకులపల్లి: జనవరి 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరుని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా మార్చనున్నారు. ఈ క్రమంలో కళా ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. సులానగర్ గ్రామంలో ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్ వీరన్న, ఉపేంద్ర జ్యోతి ఆధ్వర్యంలో మెజీషియన్, జానపద గీతాలతో పీఎం జీవనజ్యోతి, పీఎం సురక్ష బీమా, పెన్షన్ పథకంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు మైక్రో ఫైనాన్స్, ప్రైవేటు కంపెనీలు వడ్డీకి వడ్డీ ఎలా మోసం చేస్తారో వివరించారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందండి.. సకాలంలో డబ్బులు కడితే డ్వాక్రా సంఘాలకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పాటల ద్వారా తెలియజేశారు.

రెండో రోజూ నిరాహార దీక్ష

జూలూరుపాడు: చెరువులు, కుంటలు కబ్జా నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం రెండో రోజు కూడా కొనసాగింది. బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, మాలమహానాడు మండల అధ్యక్షుడు బడుగు వీరస్వామి మాట్లాడుతూ... చెరువులు, కుంటలు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని లేదంటే ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమన్నారు. డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా దీక్షా శిబిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీపీఎం నాయకుడు మృతి

జూలూరుపాడు: మాచినేనిపేటతండాకు చెందిన సీపీఎం నాయకుడు లకావత్ శ్రీను శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. భౌతికకాయాన్ని సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. సీపీఎం, కాంగ్రెస్ నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

గురుకులం ఎదుట బైఠాయింపు


గురుకులం ఎదుట బైఠాయించిన బీఆర్‌ఎస్‌వీ నాయకులు

ఇల్లెందు: బీఆర్‌ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం బీఆర్‌ఎస్‌వీ నాయకులు గురుకులం బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇల్లెందు మండలం సుదిమళ్ల గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించేందుకు వచ్చారు. కాగా ఉన్నతాధికారుల అనుమతి లేనిదే లోనికి రాకూడదంటూ అక్కడి సిబ్బంది గేట్లు మూసివేశారు. దీంతో వారు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజు, జిల్లా మహిళా నాయకురాలు సింధుతపస్వీ మాట్లాడుతూ... విద్యార్థుల సంక్షేమం కోసం, సమస్యల పరిశీలన కోసం రాగా అనుమతించకపోవటం దుర్మార్గం అన్నారు.

ఇదిలా ఉండగా పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతి లేకుండా లోనికి వెళ్లకూడదని, ఆందోళన చేయటం తగదని వారికి నచ్చజెప్పారు. గురుకులం సందర్శన కార్యక్రమంలో రాజేష్, హరికృష్ణ, అఖిల్, రాహుల్, వినయ్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించండి..

పాల్వంచరూరల్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కొత్తగూడెం ఆర్‌డీఓ డి.మధు తహసీల్దార్ వివేక్‌ను ఆదేశించారు. స్థానిక తహసీల్‌ను శుక్రవారం ఆర్‌డీఓ ఆకస్మికంగా సందర్శించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేసే ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డీఓ మధు

ఏడాదిగా ఎదురుచూపు...

ప్రజావాణిలో ఏడాది క్రితం ఇచ్చిన దరఖాస్తుకు నేటికీ పరిష్కారం కాలేదని దరఖాస్తుదారుడు బుడగం సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధి యానంబైల్ గ్రామపంచాయతీ పరిధిలో కిన్నెరసాని ప్రాజెక్టు నిర్మించిన సమయంలో తమ భూములను కోల్పోయామని పేర్కొన్నారు. భూములు కోల్పోయిన బాధిత రైతుకుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ... 2014 నుంచి ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులకు డబ్బులు ఇస్తేనే న్యాయం చేస్తామంటే.. డబ్బులు కూడా ఇచ్చానని అయినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. దీనిపై అవినీతి నిరోధకశాఖకు ఫిర్యాదు చేశానని, అప్పటి నుంచి పోలీసులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన 215 మంది లబ్ధిదారులకు రూ.2.15 కోట్ల విలువ చేసే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 110 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.40.50 లక్షల చెక్కులను శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదకుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అదేవిధంగా సీఎం రిలీఫ్‌ఫండ్ దరఖాస్తులలో సాంకేతిక సమస్యల వలన చాలా జాప్యం జరుగుతోందని దీనిని అధిగమించే ప్రభుత్వం, అధికారులు, ఆస్పత్రి యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ మధు, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయస్వామి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్‌కే సాబీర్‌పాషా, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, స్థానిక కౌన్సిలర్ ధర్మరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సూపర్‌బజార్(కొత్తగూడెం): చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

యూనిఫాం అందజేత...

కొత్తగూడెంఅర్బన్: ఐసీడీఎస్ కొత్తగూడెం ప్రాజెక్టు పరిధిలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫాం అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై అసెంబ్లీలో మాట్లాడండి...

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై అసెంబ్లీలో మాట్లాడాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు టీయూసీఐ నాయకలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సతీష్ మాట్లాడుతూ..కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు జీఓ నంబర్ 22 గెజిట్ చేసి వేతనాలు పెంచేవిధంగా కృషి చేయాలన్నారు. గోపాలరావు, ధర్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా బలంతోనే వందేళ్లు మనగలిగాం..


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచ: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ.. ప్రజా బలంతోనే వందేళ్లు మనగలిగామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం స్థానిక పాత పాల్వంచ బొడ్రాయి సెంటర్‌లో సీపీఐ 1, 2 వార్డు శాఖల సమావేశాన్ని ఎస్‌ఎ.రెహమాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ... సీపీఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అయిందని, మరో వందేళ్లయినా ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, పద్మజ, ఎస్‌కె.జానీమియా, రాజు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, చెన్నయ్య, వై.వెంకట్రామయ్య, వెంకన్న, సతీష్, జకరయ్య, రమేష్, కృష్ణ, ఖరీం, మస్తాన్, లక్ష్మి, పద్మ, రమ, రహీం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం..


పాల్వంచరూరల్: యానంబైల్‌లో పొలంబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈ


జూలూరుపాడు: రామచంద్రాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

జూలూరుపాడు: రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని టీజీఎన్‌పీడీసీఎల్ కొత్తగూడెం డీఈ (టెక్నికల్) కృష్ణ అన్నారు. శుక్రవవారం గుండెపుడి గ్రామ పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, కాలిన తీగలను మార్చడం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఏడీఈ రవికుమార్, జూలూరుపాడు ఏఈ సతీష్, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించడంతోనే ప్రయోజనం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ నందయ్య రైతులకు సూచించారు. యానంబైల్ గ్రామంలో శుక్రవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ రైతులతో మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. కెపాసిటర్ల వలన లోడు తగ్గి మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏడీఈ మధు, ఏఈ రవీందర్, ఫోర్‌మెన్ ఆంజనేయలు, లైన్‌ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, ఏఎల్‌ఎంలు, రైతులు పాల్గొన్నారు.

ఆడపడుచులు ఆర్థికంగా ఎదగాలి..

కొత్తగూడెంఅర్బన్: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని మెప్మా పీడీ రాజేష్ అన్నారు. శుక్రవారం 35వ వార్డులో మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం జరిగింది. రాజేష్ మాట్లాడుతూ... మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలని, అన్ని సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలన్నారు. ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సర్వసభ్య సమావేశానికి సంబంధించిన ఎస్ఎల్ఎఫ్ ఆడిట్ రిపోర్టు చదివి వినిపించారు. అనంతరం బీమా, మహిళా శక్తి పథకాల గురించి స్ట్రీట్ వెండర్, ఫుడ్ కోర్టు, ఇందిరా మహిళ శక్తి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ చంద్రశేఖర్, రాజీవ్ పేద ప్రాంత అధ్యక్షురాలు మునిగ సుజాత, కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి నాగలక్ష్మి, సమైక్య సభ్యులు రూప బండారి, ఆశ, అరిపినేని లక్ష్మి, ధనలక్ష్మి మల్లమ్మ, వరలక్ష్మి, రజిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ రాజేష్

మహిళలే సమాజాభివృద్ధికి పునాది

ఇల్లెందురూరల్: మహిళల ఆర్థికాభివృద్ధే సమాజాభివృద్ధికి పునాది వేస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సెర్ప్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం తన పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది వ్యవధిలోనే ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం నేడు మహిళలకు ఎంతో మేలు చేస్తోందన్నారు. మహిళా శక్తి పథకం పేరుతో పలు యూనిట్లను పంపిణీ చేసిందని గుర్తుచేశారు. ఆయా యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా వడ్డీ లేని బ్యాంకు రుణాలు, సభ్యురాలికి వ్యక్తిగత సాధారణ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం రూ.3.57 కోట్ల విలువ గల రుణ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం నాయకులగూడెం గ్రామంలో స్వయం సహాయ సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కోశాధికారి సౌజన్య, ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ కోట రవికుమార్, డీపీఎంలు రమాకాంత్, సునందన్, ఏపీఎంలు దుర్గారావు, సుభాష్, ఏపీఓ శంకర్, సీసీలు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

సీసీ రోడ్లకు శంకుస్థాపన...

టేకులపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం రూ.1.35 కోట్లతో తూర్పుగూడెం, పెగళ్లపాడు, రాంపురం, పాతతండా, కొత్తతండా, గోలియాతండా, టేకులపల్లి బ్రహ్మంగారి వీధి, లతండ , లక్ష్మీపురం , బర్లగూడెం , జంగాలపల్లి గ్రామాలలో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ ముత్తయ్య, ఎంపీఓ జేఎల్ గాంధీ, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నూతన కమిటీలకు సన్మానం...

ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో టేకులపల్లి మండలానికి చెందిన ముగ్గురు ఎన్నికయ్యారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూక్యా ఈశ్వర్ నాయక్, ఇల్లందు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ గణేష్ నాయక్, యువజన కాంగ్రెస్ టేకులపల్లి మండల అధ్యక్షుడిగా మూడ్ పవన్‌లను ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. వీరికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. కోరం సురేందర్, బండ్ల రజిని, భూక్యా దేవా, భూక్యా చందర్ సింగ్, ఈది గణేష్, పోషాలు, రెడ్యానాయక్, లక్కినేని శ్యామ్, సుదీప్, సర్దార్, బానోతు రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం...

ఇల్లెందు: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు టీయూసీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకుని రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యాకుబ్‌షావలీ, మల్లెల వెంకటేశ్వర్లు, గోపి, అలీ, శామంత్‌బాబు, లింగమూర్తి, వీరమ్మ, నిర్మల, మల్లయ్య పాల్గొన్నారు.